రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

వరుస లైంగికదాడి ఘటనలు సిగ్గుచేటు!: హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన లైంగికదాడుల గురించి అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి 48 గంటలు కాకముందే మరో మూడు ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఒక్కరోజే రాష్ట్రంలో మూడు లైంగికదాడి ఘటనలు జరగడం బాధాకరమని, సిగ్గుతో తలదించుకోవాలని ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. వరుస ఘటనలు చోటుచేసుకుంటుంటే చట్టాలు చేసే అసెంబ్లీలో ఉండి ఎందుకనే స్వీయ ప్రశ్న అందరూ వేసుకోవాలని కోరారు. పదేండ్లు మహిళా భద్రతకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ప్రస్తుతం ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై జరిగిన సామూహిక లైంగికదాడి, నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో దివ్యాంగ మహిళపై లైంగికదాడి, నిర్మల్ నుంచి ప్రకాశం వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో మహిళపై డ్రైవర్ లైంగికదాడి ఘటనలను హరీశ్‌రావు ఉదహరించారు. లైంగికదాడి బాధితులకు ప్రభుత్వం వెంటనే భరోసా కల్పించాలని, నిందితులను గుర్తించి కఠిన శిక్షలు పడేలా చొరవ చూపాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా భద్రత పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

నిర్భయ తరహా లైంగికదాడి

- కదిలే బస్సులో మహిళపై రెండో డ్రైవర్ దారుణం
- ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సులో ఘటన

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళపై డ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పామూరుకు హైదరాబాద్ మీదుగా వెళ్లే హరికృష్ణ ట్రావెల్స్ స్లీపర్ స్లీపర్ కోచ్ బస్సు సర్వీస్ (ఏఆర్01పీ7053) ఇద్దరు డ్రైవర్లతో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు నిర్మల్ నుంచి బయలుదేరింది. సిద్ధయ్య, కృష్ణ డ్రైవర్లు. అదే బస్సులో నిర్మల్ నుంచి ఎనిమిదేండ్ల కుమార్తెతో కలిసి ఓ మహిళ ప్రయాణిస్తున్నది. అర్ధరాత్రి బస్సు చేగుంట సమీపంలోరాగా రెండో డ్రైవర్ కృష్ణ గాఢనిద్రలో ఉన్న మహిళ నోట్లో గుడ్డలు కుక్కి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు తోటి ప్రయాణికులకు చెప్పడంతో డయల్ 100కు ఫోన్ చేశారు. తార్నాక రూట్‌లో బస్సు వస్తున్నదని తెలుసుకున్న ఓయూ పోలీసులు మెట్రో పిల్లర్ 1010 వద్ద బస్సును ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై విచారణ జరుపుతున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

స్నేహితుడని నమ్మితే రేప్!

- పార్టీ ఇచ్చిన యువతిపై మరొకరితో కలిసి లైంగికదాడి
- హైదరాబాద్ వనస్థలిపురం పరధిలో ఘటన

వనస్థలిపురం, జూలై 30: తనను నమ్మి వచ్చిన స్నేహితురాలిపై మరో వ్యక్తితో కలిసి లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన హైదరాబాద్ నగరంలో చోటుచేసుకున్నది. హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీకి చెందిన గౌతంరెడ్డి, యువతి స్నేహితులు. ఆమెకు ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో పార్టీ ఇవ్వాలన్న గౌతంరెడ్డి కోరిక మేరకు సోమవారం రాత్రి 7.30కు ఓంకార్‌నగర్‌లోని బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ మద్యం సేవించారు. మద్యం మత్తు దిగిన తర్వాత వెళ్లాలని నిర్ణయించుకొని అదే హోటల్‌లో ఓ గదిని తీసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న యువతిని చూసిన గౌతంరెడ్డిలో రాక్షసత్వం మేల్కొన్నది. స్నేహితురాలనే విషయాన్ని మరిచి లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి మత్తులో ఉండటాన్ని ఆసరాగా చేసుకొని తన స్నేహితుడైన మరో యువకుడిని కూడా రప్పించాడు. ఇదే అవకాశముంటూ అతడు కూడా ఆమెపై లైంగిక దాడి చేశాడని పోలీసులు వెల్లడించారు.

ఆ యువతి నిద్రలేచే సరికి..

యువతి నిద్రలో నుంచి లేచేవరకు గదిలోనే గౌతంరెడ్డితోపాటు మరో వ్యక్తి కూడా ఉన్నారు. రక్తస్రావం జరిగిన విషయాన్ని గుర్తించిన బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో దుండగులిద్దరూ గది నుంచి పరారయ్యారు. వెంటనే హోటల్ సిబ్బంది అక్కడకు చేరుకొని జరిగిన విషయాన్ని తెలుసుకొని బాధితురాలి స్నేహితులు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన స్నేహితులు జరిగిన ఘోరంపై పోలీసులకు తెలిపారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకున్న వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడైన గౌతంరెడ్డిని అరెస్ట్ చేశామని, మరో నిందితుడి కోసం గాలిస్తున్నామని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి తెలిపారు. హోటల్‌లో సీసీ కెమెరాలను కూడా తనిఖీ చేస్తున్నామని చెప్పారు.

దివ్యాంగురాలిపై లైంగిక దాడి

శాలిగౌరారం, జూలై 30: మానసిక దివ్యాంగురాలిపై (17) దుండగుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం శాలిలింగోటంలో సోమవారం చోటుచేసుకుంది. కేసు వివరాలను శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సైదులు మంగళవారం తెలిపారు. బాధితురాలి తండ్రితో నిందితుడు దశరథ కలిసి పనికి వెళ్లేవాడు. పనిలో భాగంగా నిత్యం వారింటికి వస్తూ పోతున్న క్రమంలో ఒంటరిగా ఉంటున్న దివ్యాంగురాలిపై కన్నేశాడు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులు పనికి వెళ్లిన విషయం తెలుసుకొని ఆ ఇంటికి వెళ్లిన దశరథ దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాధితురాలు విషయం చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. బాధితురాలిని దవాఖానాకు తరలించారు. లైంగిక దాడి విషయంపై మంగళవారం శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి గ్రామంలో విచారణ చేపట్టారు. చుట్టుపక్కల వారితో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు.

చిన్నారిపై లైంగికదాడి.. 20 ఏండ్ల జైలు

జగిత్యాల కలెక్టరేట్, జూలై 30: నాలుగేండ్ల చిన్నారిపై లైంగికదాడి చేసిన మృగాడికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ ఎస్సై రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. 2020లో జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేండ్ల చిన్నారి తన ఏడేండ్ల అన్నతో కలిసి కిరాణా దుకాణానికి వెళ్తున్నది. అదే గ్రామానికి చందిన కండ్లె రమేశ్‌బాబు (32) వారిని ఆపాడు. చిన్నారి అన్నను దుకాణానికి పొమ్మని చెప్పిన రమేశ్‌బాబు.. నాలుగేండ్ల చిన్నారిని పక్కనే ఉన్న ఓ ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. చిన్నారి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చారు. దీంతో రమేశ్‌బాబు అక్కడి నుంచి పారిపోయాడు. చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ అప్పటి ఎస్సై చిర్ర సతీశ్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయగా.. జగిత్యాల రూరల్ అప్పటి సీఐలు రాజేశ్, కృష్ణకుమార్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా.. పీపీ కేసు వాదించి రమేశ్‌బాబు చేసిన నేరాన్ని నిరూపించారు. దీంతో నేరస్థుడు రమేశ్‌బాబుకు 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతోపాటు బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు.

నమ్మించి లైంగికదాడి.. నిందితుడి అరెస్టు

బేగంపేట్ జూలై 30: ఓ యువతిని నమ్మించి లైంగికదాడికి పాల్పడి విదేశానికి పారిపోతున్న నిందితుడిని హైదరాబాద్ మహంకాళి పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం కేసు వివరాలను తెలిపారు. జనగాం జిల్లా గంగాపూర్‌కు చెందిన బండారం స్వామి (29) ఆస్ట్రేలియాలో పౌల్ట్రీలో జాబ్ చేస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌కు చెందిన ఓ యువతి(27)తో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడి చాటింగ్ చేస్తూ మాట్లాడుకునేవారు. అది ప్రేమగా మారి వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఇటీవల స్వామి స్వదేశానికి వస్తున్నానని సదరు యువతిని హైదరాబాద్‌కు రావాల్సిందిగా కోరాడు. ఈ నెల 3న సికింద్రాబాద్ మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాహుల్ ఇంటర్నేషనల్ హోటల్‌లో వారిద్దరూ రెండురోజులపాటు బస చేశారు. ఆ తర్వాత యువతిని ఇంటికి పంపి, స్వామి జనగాంలోని సొంతూరికి వెళ్లిపోయాడు. అనంతరం యువతి పెళ్లి విషయాన్ని ప్రస్తావించగా స్వామి నుంచి స్పందన కరువైంది. మళ్లీ విదేశానికి వెళ్తున్నట్టు తెలుసుకున్న యువతి ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును మహంకాళి పోలీసులకు బదిలీ చేశారు. మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నిందితుడు చేరుకున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న మహంకాళి పోలీసులు స్వామిని ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపారు.

నీళ్లులేక మైదానాన్ని తలపిస్తున్న కొండపోచమ్మ సాగర్

సిద్దిపేట జిల్లా సంగారెడ్డి కెనాల్‌లో మొలిచిన తుంగ

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో ఎండిపోయి కనిపిస్తున్న బందం చెరువు

కాళేశ్వరం నీళ్లొస్తేనే నాట్లు

- నారుపోసి 50 రోజులు దాటింది
- మడుల్లో ముదురుతున్న నారు
- అదును దాటిన తర్వాత సాగుచేస్తే దిగుబడులపై తీవ్రప్రభావం
- సాగునీటికి ఎదురుచూపులు
- ఉమ్మడి మెదక్‌లో అడుగంటిన భూగర్భజలాలు
- కేసీఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా సాగునీరు
- రికార్డు స్థాయిలో పంటలు

సిద్దిపేట, జూలై 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో అన్నిచోట్ల వర్షాలు కురిసి చెరువుల్లోకి నీళ్లు వస్తున్నాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మాత్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. ఫలితంగా జిల్లాలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. బోరుబావుల్లో నీళ్లు లేవు. రైతులంతా వానకాలం వరినాట్లు వేయడానికి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. నార్లు పోసి రోజులు గడుస్తున్నాయి. వరి నారు నెల రోజుల్లోగా నాటు వేయాల్సిన రైతులు సాగునీరు ఆలస్యం అవుతుండటంతో వేయలేకపోతున్నారు. 'రేపు వస్తాయి కావచ్చు.. మాపు వస్తాయి కావచ్చు' అని దీనంగా ఎదురుచూస్తున్నారు. నాటు ఆలస్యమయ్యే సరికి పొలాల్లో గడ్డి ఏపుగా పెరిగిపోయింది. పొలాలు బీడు వారిపోతున్నాయి. ఒక్కో రైతు నారుమడి 50 రోజులు దాటింది. అదును దాటిన తర్వాత సాగుచేస్తే పంట దిగుబడి ఏ మేరకు వస్తుందో అని రైతులు దిగాలు చెందుతున్నారు. వానకాలంలో సిద్దిపేట జిల్లాలో 3.48 లక్షలు, మెదక్ జిల్లాలో 3,27,113 , సంగారెడ్డి జిల్లాలో 1.50 లక్షల్లో వరి సాగు లక్ష్యం కాగా ఎక్కడ కూడా 50 శాతం వరి నాట్లు పడలేదు. సాగునీటి కష్టాలతోనే రైతులు వరినాట్లు వేయడం లేదు.

కాళేశ్వర జలాలు వస్తేనే సాగు

కాళేశ్వరం నీళ్లు వస్తేనే సాగు ముందుకు కదిలేలా ఉంది. తక్షణమే అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు నింపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్లను సకాలంలో నింపడంతో వానకాలం సాగు సాఫీగా సాగింది. రికార్డు స్థాయిలో ధాన్యం పండించారు. నిరుడు ఇదే సమయంలో వరి నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో ఎటుచూసినా బీళ్లు కనిపిస్తున్నాయి. వాగులు ఎండిపోయాయి. ప్రభుత్వం ఏమో రైతుల మొర ఆలకించడం లేదు. జిల్లాలోని ప్రధాన కాలువలు పిచ్చి మొక్కలు, తుంగ, మట్టి తదితర వాటితో పూర్తిగా నిండిపోయాయి. ప్రధాన చెరువులు నీళ్లులేక బోసిపోయి దర్శనమిస్తున్నాయి. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం ఎండాకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చెరువులు, కుంటలు నింపడంతో వానకాలంలో ఒకటి రెండు పెద్ద వానలు కురువగానే నీళ్లు వచ్చి చెరువులు అలుగు పారాయి. దీంతో రైతులకు పుష్కలంగా సాగునీరు అందింది. రైతులు సకాలంలో వరినాట్లు పూర్తి చేసుకున్నారు. ఇవాళ ఆ పరిస్థితులు లేవని రైతులు చెబుతున్నారు. ఉదాహరణకు వర్గల్ మండలంలోని బందం చెరువు ఎప్పుడు కాళేశ్వర జలాలతో నిండుకుండలా ఉండేది. ఇప్పుడు నీళ్లు లేక ఎండిపోయింది. కనీసం కొన్ని ప్రాంతాల్లో గొర్రెలకు తాగడానికి నీళ్లు లేవని గొర్ల కాపరులు చెబుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎటుచూసినా నీళ్లే కనిపించాయని, ఇవ్వాళ నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. జిల్లాలోని ప్రధాన వాగులైన కూడవెల్లి, హల్దీవాగు బోసిపోయి కనిపిస్తున్నాయి. గతేడాది ఇదే సమయంలో నిండుకుండలా ఉన్నాయి. జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లను గోదావరి జలాలతో నింపితే సిద్దిపేట, మెదక్, యాదాద్రి జిల్లాలతో పాటు ఉమ్మడి నిజామాబాద్‌కు సాగునీటి గోస తీరుతుంది. ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసి తక్షణమే నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ సర్కార్ పగ

- సాగునీరివ్వక అరిగోస పెడ్తున్నది
- ఉత్తర తెలంగాణపై కక్షసాధింపు
- కెనాల్ ద్వారా సాగునీరిచ్చే వరకు పోరాడుతం
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు
- వర్గల్ మండలం సింగాయిపల్లి లింక్ కెనాల్‌వద్ద రైతులతో నిరసన

సింగాయిపల్లిలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

వర్గల్, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిందని బీఆర్ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. కుట్రలో భాగంగానే గోదావరి జలాల తరలింపు చేపట్టకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయిపల్లి వద్ద కొండపోచమ్మసాగర్ రామాయంపేట-సంగారెడ్డి లింక్ పాయింట్ వద్ద రైతులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా సాగునీరు ఇవ్వకపోతే వేలాదిమంది రైతులతో కలిసి రాజీవ్ రహదారిని ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 18 లక్షల ఎకరాలకు నీరందించేందుకు ఎల్లంపల్లి, సుందిళ్ల, మల్లన్నసాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయకసాగర్, అనంతగిరి వంటి ప్రాజెక్టులు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగాయని మొత్తం ప్రాజెక్టులకే ఎత్తిపోతలు బంద్‌చేస్తే ఇక తెలంగాణ రైతాంగం బతికేదెట్లా? అని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లో 7 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 4 టీఎంసీలు నిల్వ ఉన్నప్పటికీ వానకాలం వరినాట్ల కోసం చుక్క నీటి బొట్టు విడిచిపెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు తీరుతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఉత్తర తెలంగాణపై చిన్నచూపు చూస్తున్నదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 8 నెలలైనా ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదని అన్నారు. 6 గ్యారెంటీల అమలు గాలికొదిలేశారని విమర్శించారు. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నుంచి తుర్కపల్లి, జగదేవ్‌పూర్ మండలాల మీదుగా వెళ్లే కెనాల్‌కు, అలాగే రామాయంపేట - సంగారెడ్డి కాలువల్లోకి నీరు వదలకపోతే రెండు,మూడు రోజుల్లో కార్యాచరణ రూపొందించి రైతాంగం పరిరక్షణ కోసం రాజీవ్ రహదారిని దిగ్బంధించేందుకు బీఆర్ఎస్‌తోపాటు అన్ని పార్టీల మద్దతుతో ముందుకెళ్తామని ప్రకటించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతాప్‌రెడ్డి కెనాల్‌ను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు వీడాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో వర్గల్ మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలో గొర్లకాపర్లు

కేసీఆర్ పాలనే బాగుండె

- గొర్లకు నీళ్లు లేక ఇబ్బందయితున్నది
- బందం చెరువు ఎండిపోయింది
- కేసీఆర్ ఉనప్పుడు కాలువల్ల రోజు నీళ్లుపారుతుండే
- వర్గల్ మండలం గౌరారంలో గొర్లకాపర్ల కామెంట్

గజ్వేల్, జూలై 30: 'కేసీఆర్ ఉన్నప్పుడే నయముండే. తీసుకుంటే జాగలు తీసుకుండు కానీ అందరికీ మేలు చేసిండు. కాలువల్లో చేతికి అందేలా నీళ్లు ఉండేవి. ఇప్పుడైతే కాలువల్లో తుంగ మొలిచి ఎండిపోయింది. కేసీఆర్ ఎప్పుడు పంటలు పండించుకునేందుకు కాలువల్లో నీళ్లు ఉంచితే.. వీళ్లయితే ఇప్పటివరకు నీళ్లను కాలువల్లోకి వదలలేదు' అని సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన గొర్లకాపర్లు దుప్పటి వీరయ్య, మల్లంపల్లి అంజయ్య, నీలం ఐలయ్య అన్నారు. మంగళవారం గౌరారం గ్రామ సమీపంలో గొర్లకాపర్లు జీవాలు మేపుతుండగా 'నమస్తే తెలంగాణ' వారిని పలుకరించగా తమ బాధలను చెప్పుకొచ్చారు. 'ఇప్పుడు గొర్లకు నీళ్లు దొరకుతలేవంటే ఎట్లా ఉందో మీకే తెలువాలే. కేసీఆర్ గొర్లు ఇస్తే వాటికి నీళ్లు ఇచ్చేటోడు.. ఇప్పుడు ఇచ్చే దిక్కులేదు. ఇట్లుంది మా పరిస్థితి. భగవంతుడేమో వర్షాలు ఇస్తాలేడాయే. ఎట్లా బతికేది మేము?. మా ఊర్లోని బందం చెరువు ఎప్పుడు అలుగు పారుతుండే. ఇప్పుడేమో ఎండిపోయింది. మాట్లాడుకుంటే ఏమీ లాభం. కేసీఆర్ ఉన్నప్పటికీ ఇప్పటికీ ఆస్మాన్ పరక్ కనిపిస్తుంది' అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్ల ద్వారా దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

శ్రీశైలంలో కృష్ణమ్మ పరవళ్లు

- డ్యామ్ 10 గేట్ల నుంచి నీటివిడుదల
- జూరాలకు 2.90 లక్షల క్యూసెక్కులు

మహబూబ్‌నగర్, జూలై 30 (నమస్తేతెలంగాణ ప్రతినిధి)/హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్: కృష్ణా, తుంగభద్ర నదులకు భారీగా వరద వస్తున్నది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్‌తోపాటు తుంగభద్ర డ్యాంలకు పెద్ద మొత్తంలో ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. మంగళవారం జూరాలకు 2.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 2,86,115 క్యూసెక్కులు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం వద్ద వరద పెరగడంతో డ్యాం 10 క్రస్ట్ గేట్లను 10 అడుగులమేర ఎత్తి సాగర్‌కు అధికారులు నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 4,13,173 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 3,32,447 క్యూసెక్కులుగా నమోదైంది. నాగార్జున సాగర్‌కు 1,05,710 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 6,877 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. కాగా మేడిగడ్డ బరాజ్‌కు 7,25,050 క్యూసెక్కులు, అన్నారం బరాజ్‌కు 6,894 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది.

భద్రాచలం వద్ద 43 అడుగుల నీటిమట్టం

భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రానికి 43 అడుగులకు నీటిమట్టం చేరింది. కాగా, కాళేశ్వరం వద్ద మంగళవారం 7.25 లక్షల క్యూసెక్కులు, సమ్మక్క బరాజ్ వద్ద 9,15,560 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది.

కాళేశ్వర గంగ పరుగులు

- లింక్-2లో కొనసాగుతున్న ఎత్తిపోతలు
- నంది, గాయత్రిలో ఐదేసి మోటర్ల ద్వారా..
- ఏకకాలంలో 15,750 క్యూసెక్కుల పంపింగ్

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, జూలై 30 : కాళేశ్వర గంగ పరుగులు తీస్తున్నది. లింక్-2లో దిగువ నుంచి ఎగువకు ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు జలాశయానికి పరవళ్లుతొక్కుతున్నది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్‌హౌస్‌లో ఐదు మోటర్లు (2,3,5,6,7వ) నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 చొప్పున 15,750 క్యూసెక్కులు డెలివరి సిస్టర్న్‌ల ద్వారా ఎగిసిపడి నంది రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. అక్కడ రిజర్వాయర్ గేట్లను ఎత్తడంతో అంతే మొత్తంలో జలాలు అండర్ టన్నెళ్లలో గ్రావిటీ ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. అక్కడా ఐదు మోటర్లు ద్వారా 15,750 క్యూసెక్కులు లిఫ్ట్ చేస్తుండగా, డెలివరి సిస్టర్న్‌ల ద్వారా ఎగిసిపడ్డ జలాలు మధ్యమానేరుకు పరుగెడుతున్నాయి. మధ్యమానేరు పూర్తి నీటి సామర్థ్యం 27.054 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.84 టీఎంసీలకు చేరుకున్నది.

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉబికివస్తున్న గోదావరి జలాలు

రాజరాజేశ్వరి దేవికి అగ్గిపెట్టెలో ఇమిడే చీర

సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్.. వేములవాడ రాజరాజేశ్వరిదేవి కోసం అగ్గిపెట్టెలో ఇమిడే శాలువా, చీరను నేసి మంగళవారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. వారి వెంట ఈవో సీసీ ఎడ్ల శివసాయి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు.

– వేములవాడ టౌన్

'మావోయిస్టులను కోర్టులో హాజరుపర్చండి'

హైదరాబాద్, జూలై 30(నమస్తే తెలంగాణ): పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు మావోయిస్టులు జైసింగ్, రమేశ్, సుక్కిని వెంటనే కోర్టులో హాజరుపర్చాలని భూపాలపల్లి, ములుగు, వరంగల్, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి వెంకటేశ్, పౌరహక్కుల సంఘం నేతలు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. వీరిని ఈనెల 29న భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఎన్‌కౌంటర్ పేరుతో చంపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వారికి ఎలాంటి హాని జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతవహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది సున్నా

- బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు సమాధానం చెప్పాలి
- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వాలి
- కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుచేయాలి
- రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఇచ్చింది సున్నా అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మండిపడ్డారు. మంగళవారం రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చలో ఆయన పాల్గొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు అభినందనలు తెలిపారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు ఏమీ దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు చొరవతో ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారిందని.. తెలంగాణ